## క్లుప్తంగా

### భార్గవికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు చిట్టిమళ్ల భార్గవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొడక్టివిటీ అండ్ ప్రాఫిటబులిటీ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్ ఇన్ ఇండియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి భార్గవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. డాక్టర్ జి.శశిధర్‌రావు పర్యవేక్షణలో భార్గవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. కాగా, భార్గవి ప్రస్తుతం వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

### ఓయూ నుంచి మధుశ్రీకి డాక్టరేట్



మధుశ్రీని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా కళాశాల కాంట్రాక్టు అధ్యాపకురాలు జి.మధుశ్రీకి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో కంట్రోలింగ్ ఎల్పీ ఫాల్సిఫయింగ్ యూజింగ్ రియలిస్టిక్ సిమ్యులేషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మధుశ్రీకి ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ప్రొఫెసర్ సీవీ.గురురావు పర్యవేక్షణలో మధుశ్రీ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో ఆమెను వీసీ ప్రొఫెసర్ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు బుధవారం అభినందించారు.

### లూకేఫ్ టాయిలెట్లకు వర్క్ ఆర్డర్

వరంగల్ అర్బన్: నగరంలోని లూకేఫ్ టాయిలెట్లకు వర్క్ ఆర్డర్ ఇస్తామని బల్దియా పర్యావరణ ఇంజనీర్ సంజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు లూకేఫ్ టాయిలెట్లను సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ సంజయ్ కుమార్‌లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు.

### విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



హసన్‌పర్తి: విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను చింతగట్టు సబ్‌స్టేషన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ గంగారెడ్డి మాట్లాడుతూ రక్షణ పరికరాలు ఉపయోగించి విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కరెంట్ విషయంలో ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇన్‌స్పెక్టర్ రాజుకు సన్మానం



కాజీపేట: కాజీపేట ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సార్ల రాజును భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మడి రాజు, పాలడుగుల శివకుమార్, తేలు సారంగపాణి, జేరిపోతుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతకు అభినందన



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడు ఎస్‌కే.జానీమియాకు శ్రమశక్తి అవార్డు లభించింది. కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో పని చేస్తున్న జానిమియా సేవలను గుర్తించిన తెలంగాణ కార్మిక శాఖ.. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మే డే రోజు జరిగిన కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు ప్రదానం చేసింది. ఈమేరకు జానీమియాను మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, సీహెచ్.శంకర్‌రావు డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, నాయకులు, కార్మికులు మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు.

**పోపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కు..**

ఖిలా వరంగల్: తెలంగాణ పోపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ను వరంగల్ శివనగర్‌లో మహాలక్ష్మి విహార సంఘం ప్రతినిధులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలీలకు అండగా ఉంటానని, పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక రంగాల్లో ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బుదారపు శ్రీనివాస్, సింగం అశోక్, కుడికాల మనోహర్, కందగట్ల గణేష్, వడ్డేపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ బహిరంగ సభకు తరలిరావాలి



హన్మకొండ: మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

హన్మకొండ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి కె.తారక రామారావు పాల్గొనే బహిరంగ సభకు వేలాదిమంది ప్రజలు తరలిరావాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని నిత బాంక్వెట్ హాల్‌లో బీఆర్ఎస్ 51, 52, 54, 57, 59వ డివిజన్ల కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, పలు పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అనంతరం సెయింట్ గాబ్రియెల్ మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జ్‌లు డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బి.వీరేందర్, కేశవ రెడ్డి, లక్ష్మీనారాయణ, బోయినపల్లి రంజిత్‌రావు, గుంటి రజిత, నల్ల స్వరూపరాణి, సుధాకర్ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి, రాజు, మోహన్ పాల్గొన్నారు.

**కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి**

హసన్‌పర్తి: ఈనెల 5వ తేదీన జరగనున్న మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. హసనపర్తి, ఐనవోలు మండలాల ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులతో హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 5న సాయంత్రం 3గంటలకు కిట్స్ కళాశాలతో పాటు బాలాజీ గార్డెన్‌లో పలు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. హనుమకొండలో జరగనున్న మంత్రి బహిరంగ సభకు జన సమీకరణ ఏర్పాట్లపై నేతలతో చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్లు సునీల్‌కుమార్, జక్కుల రజిత, దివ్యారాణి, అరుణ, షీబారాణి, రాధికారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, మణీందర్, అటికం రవీందర్, శ్రీనివాస్, జంగా కుమార్, మండల అధ్యక్షుడు రజనీకుమార్ పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న బంక సరళ

హన్మకొండ: వరంగల్ మహానగర అభివృద్ధిని విస్మరించిన రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని కాంగ్రెస్ మహిళా విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళయాదవ్ హెచ్చరించారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నగరంలో పర్యటించినప్పుడు హంగు ఆర్భాటాలు చేయడం తప్ప అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. పైలట్ ప్రాజెక్టు కింద 2016లో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలి నుంచి ఎన్జీవోస్ కాలనీ, వడ్డెపల్లి చర్చి కూడలి వరకు రోడ్డు అభివృద్ధి చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. గుల్ల చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధే ఇప్పటికీ కనిపిస్తోందని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ మహిళా విభాగం హనుమకొండ బ్లాక్ అధ్యక్షురాలు సుజాత, కమల, శ్యామల, సుజాత గౌడ్ పాల్గొన్నారు.

### మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: కులమతాలకు అతీతంగా ముస్లింలు జరుపుకునే ఈద్ మిలాప్.. మత సామరస్యానికి ప్రతీక అని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ శంభునిపేటలోని ఆర్ఆర్‌గార్డెన్‌లో ఫోర్ట్‌రోడ్డు హజ్రత్ జానుల్లా షహీద్ దర్గా, గ్రేవ్‌యార్డ్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ.ఖలీల్ తన్వీర్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం కన్వీనర్ మహ్మద్ ముషైద్ తహశీర్ అధ్యక్షతన ఈద్ మిలాఫ్ కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ శాంతియుత సమాజ స్థాపన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం ముస్లిం మతపరమైన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మసూద్, అబ్జల్, బల్దియా అడిషనల్ కమిషనర్ రషీద్, ఉర్సు దర్గా పీఠాధిపతి సోయబ్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు అధికారులు దాసోహం



ఫ్లెక్సీపై టమాటాలు విసురుతూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వరంగల్: అధికార పార్టీకి మున్సిపల్ అధికారులు బానిసలుగా మారి నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారని వరంగల్ తూర్పు బీజేపీ కన్వీనర్ కుసుమ సతీష్ అన్నారు. మున్సిపాలిటీ అధికారుల ధోరణికి నిరసనగా పోచమ్మమైదాన్ జంక్షన్‌లో వారి అలసత్వాన్ని ఫ్లెక్సీలో ముద్రించి టమాటాలతో కొట్టి బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యక్రమాల సందర్భంగా నగరంలోని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 24గంటలు కూడా ఉంచకుండా తీసివేస్తున్నారని, అదే బీఆర్ఎస్ పార్టీ బ్యానర్లు ఫ్లెక్సీలు, జెండాలను వారం రోజులుగా ఉంచుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు వన్నాల వెంకటరమణ, బైరి శ్యాంసుందర్, సముద్రాల పరమేశ్వర్, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకట్, రజనీష్ నేత, మురళీకృష్ణ, ప్రసాద్, రాజు, పలు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**బల్దియా ఆవరణలో..**

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై బీజేపీ నాయకులు బుధవారం కోడిగుడ్లు, టమాటాలు వేశారు. అనంతరం అధికారులు జోక్యం చేసుకుని ఫ్లెక్సీని తొలగించారు.

# సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతులు



ఖిలా వరంగల్: మంత్రికి వినతిపత్రం అందజేసి సన్మానిస్తున్న కాలనీల ప్రతినిధులు



న్యూశాయంపేట: మంత్రి దయాకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వరంగల్ శంభునిపేటతోపాటు 21కాలనీల కమిటీ కార్యవర్గం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైల్వేగేట్ ప్రాంతంలోని వెనుకబడిన కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామానుజన్ జగదీశ్వర్, కర్నె రవీందర్, స్పందన, పాక వెంకటేష్, సదానందం, వేల్పుల కొమురయ్య, శ్రీనివాస్ గుప్తా, రాంబాబు, సాగర్, వీర్యానాయక్, మహమ్మద్ రఫీక్, మల్లికార్జున్ రావు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**ముస్లింల అభివృద్ధికి మరింత కృషి చేయాలి**

న్యూశాయంపేట: హనుమకొండకు చెందిన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మంత్రి దయాకర్ రావును హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలిశారు. ఈమేరకు ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. అనంతరం మంత్రికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ కలీం, మహ్మద్ సిరాజ్ అహ్మద్, నదీమ్ బేగ్, మహ్మద్ నాజ్రీన్, మహ్మద్ రఫీఖ్ పాల్గొన్నారు.

# రేపు 'చలో బుద్ధవనం' కార్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

నయీంనగర్: గౌతమ బుద్ధుడి జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని 125అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు శుక్రవారం కార్ ర్యాలీ నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క సుదర్శన్ తెలిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్ ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచమంతా బుద్ధుడు చూపిన శాంతి మార్గం వైపు చూస్తోందని తెలిపారు. సమావేశంలో నాయకులు తరాల సందీప్, అంబేడ్కర్, రవిప్రసాద్, కృష్ణస్వామి, సుధాకర్, వెంకటస్వామి, సింగారపు వేణు తదితరులు పాల్గొన్నారు.

# దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాల ప్రతిష్ఠాపనలో యాదవ సంఘం కుల పెద్దలు

మడికొండ: రేణుక ఎల్లమ్మ మహంకాళి బీరప్ప దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని 46వ డివిజన్ రాంపూర్‌లో అర్చకుడు సంతోష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య బుధవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు వేడుకలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం సామూహిక హోమాలు, సాయంత్ర ధాన్యదివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలదివాసం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, శుక్రవారం ఉదయం యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, దుష్టికుంభం, బలిప్రదానం, పూర్ణాహుతి, పండిత సన్మానం, మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మాదరబోయిన సతీష్, బాషబోయిన కుమార్, తొట్టె ఆగయ్య, నాగరాజు, బండి పరశురాములు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న చీఫ్‌విప్

కాజీపేట అర్బన్: అంకితభావంతో ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 ఉచిత కోచింగ్ శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఉచిత కోచింగ్‌ను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి పుష్పలత, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**చెక్కుల పంపిణీ**

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో 235మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పంపిణీ చేశారు. కాజీపేట పట్టణంతో తన కుటుంబానికి ఉన్న విడదీయరాని అనుబంధంతో సంక్షేమ పథకాల పంపిణీలో పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.

# చివరి గింజ వరకూ కొంటాం..



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వంగపహాడ్, సిద్ధాపురం, బైరాన్‌పల్లిల్లో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈమేరకు అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిందని ఎమ్మెల్యే వద్ద రైతులు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులు ఆందోళన చెందొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్ చైర్మన్లు జక్కు రమేష్, మేర్గు రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్, మాజీ ఉప సర్పంచ్ చిరంజీవి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మనబడి - మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్ పాల్గొన్నారు.

# అవినీతి ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న జన్ను దినేష్‌మాదిగ

హన్మకొండ: అవినీతి ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జన్ను దినేష్‌మాదిగ మాట్లాడుతూ అవినీతి లేని స్వచ్ఛమైన పాలన అందిస్తామని చెప్పి బీఆర్ఎస్ పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బంధు పథకంలో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఎమ్మెల్యేలు తీసుకున్నారని స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పడం అవినీతి జరుగుతోందనడానికి నిదర్శనమని తూర్పారబట్టారు. ఈక్రమంలో అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్, నాయకులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ డే



హసన్‌పర్తి: మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రీస్కూల్ డేతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ -5వ కేంద్రంలో వివిధ వేషధారణలో చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు శీలం కమల, రజని, స్వరూప, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

### విప్లవ స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలి



కాజీపేట: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో కార్మికుల హక్కులను అణచివేస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. ఈక్రమంలో కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలు విప్లవ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. మేడే వేడుకలను పురస్కరించుకుని కాజీపేట చౌరస్తాలో ఎర్ర జెండాను బుధవారం ఎగురవేశారు. కార్యక్రమంలో రొయ్యల రాజు, దామెర సుదర్శన్, స్వామి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హసన్‌పర్తి: లేబర్ కార్డు ఉన్న ప్రజలు ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సూచించారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ సహకారంతో హసన్‌పర్తి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మెగా హెల్త్ క్యాంప్ జిల్లా కోఆర్డినేటర్ జావిద్, జనగామ జిల్లా కోఆర్డినేటర్ రామంచ సుమన్, మాజీ వార్డు సభ్యుడు తాళ్లపల్లి రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరు

కాశిబుగ్గ: గద్దె నుంచి తాడును తెంపి జెండా కిందపడేసినంత మాత్రాన నగరంలో బీజేపీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ అన్నారు. కొందరు తమ జెండా గద్దెకు బీఆర్ఎస్ ఫ్లెక్సీ కట్టి బీజేపీ జెండాను కింద పడేశారంటూ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెండా గద్దెను శుద్ధి చేసి కొత్త బీజేపీ జెండాను బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై చర్యలు తీసుకోవాలని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్‌కుమార్, మార్టిన్ లూథర్, మాదాసు రాజు, తగరపు బాబురావు, లింగారెడ్డి ఉన్నారు.

### జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కాశిబుగ్గ: ములుగు జిల్లా రామాంజపురంలో ఈనెల 5న జరగనున్న ఎరుకల నాంచారమ్మ జాతరను జయప్రదం చేయాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. జాతర వాల్‌పోస్టర్లను కాశిబుగ్గ శివాలయం ఎదుట బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, పల్లకొండ ప్రభాకర్, హరి, ఓని సదానందం, మానుపాటి రమేష్, పులిచేరి సురేష్, దుగ్యాల రామ్, కంప శ్రీను, సాయిలు, పూర్ణచందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేత మృతికి సంతాపం

హన్మకొండ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గరిగె వెంకటస్వామి మృతి పట్ల దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ సంతాపం ప్రకటించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, గుడిసె వాసుల సమస్యలపై వెంకటస్వామి పోరాడారని గుర్తుచేశారు. అహర్నిశలు కష్టపడి గుడిసె వాసులకు పట్టాలిప్పించారని రమేష్‌కుమార్ తెలిపారు.

### కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

కాళోజీ సెంటర్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు వరంగల్ జిల్లాలో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నిర్వహించిన ఓపెన్ టెన్త్ పరీక్ష ఇండియన్ కల్చర్, హెరిటేజ్ సబ్జెక్టుకు 161 మంది విద్యార్థులకు గాను 150 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. అదే విధంగా ఇంటర్మీడియట్ గణితం పరీక్షకు 48 మంది విద్యార్థులకు గాను 42 మంది హాజరు కాగా, ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు.

### 196 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కరీమాబాద్: వరంగల్ జిల్లాలో 196 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గౌరీశంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సంబంధించి సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424, మొబైల్ నంబర్ 91542 52936 ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులకు ఏ సమస్యలున్నా ఆయా నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్స్ అగు 1) **మద్దోజు రమేష్**, S/o. వెంకటయ్య, 2) **మద్దోజు అనిల్‌కుమార్**, S/o. మద్దోజు రమేష్, 3) **మద్దోజు అనిత**, D/o. మద్దోజు రమేష్, సాకిన్: ఇ.నం.7-7-281/3, కాపువాడ, హన్మకొండ గార్లు సర్వే నం. 254లో ఎనుమాముల గ్రామం, వరంగల్ మండలం, జిల్లాలోని 1,346 చ॥గ॥ ఖాళీ జాగా / ప్లాట్స్ భూమికి నా క్లయింట్స్ సంపూర్ణ యాజమాన్య స్వాధీనం హక్కు భుక్తములో యున్నది. పూర్వము శ్రీ Mohd. అబ్దుల్ వాసే, S/o. యం.ఎ ఖాలిక్, సాకిన్: సుబేదారి, హన్మకొండ దివి. 07.08.2020 రోజున షెడ్యూల్ ఆస్తిని విక్రయించుటకు ఒప్పుకొని నా క్లయింట్స్ నెం. 1,2,3 నుండి అగ్రిమెంట్ చేసుకొని బయానాగా రూ.10,00,000/- (రూపాయలు పదిలక్షలు) ఇచ్చినారు. కాని అగ్రిమెంట్ ప్రకారం సకాలంలో పూర్తి విక్రయ ధనం చెల్లించనందున నా క్లయింట్స్ దివి. 13.03.2023 రోజున లీగల్ నోటీస్ ఇచ్చి అట్టి అగ్రిమెంట్ రద్దు పర్చినారు. కావున సమస్త ప్రజలకు ఇట్టి హెచ్చరిక ఏమనగా, శ్రీ Mohd అబ్దుల్ వాసే, S/o. ఎం.ఎ ఖాలిక్ మరియు ఎవరితోనైన షెడ్యూల్ భూమిపై లావాదేవీలు చేయరాదు, చేసినచో చెల్లనేరదు, మరియు అట్టి క్రయ విక్రయాలకు నా క్లయింట్స్‌కు ఎటువంటి బాధ్యత యుండదు.

**షెడ్యూల్ ఆస్తి**


ఖాళీ జాగా / ప్లాట్స్ విస్తీర్ణం 1,346 చ॥గ॥ సర్వే నెం: 254 ఎనుమాముల గ్రామం, వరంగల్ మండలం జిల్లా హద్దులు: తూర్పు: శ్రీ కె. రవీందర్ మరియు సరిత భూమి, పడమర: శ్రీమతి స్వరూప, భర్త: సుదర్శన్ గారి భూమి, ఉత్తరం: 30 ఫీట్ రోడ్డు, దక్షిణం: మొగిలిచర్ల 100 ఫీట్ రోడ్

// నా క్లయింట్ కోరిక మీద ఇవ్వబడినది //

Date: 02-05-2023

Sd/- **Syed Jafer Ahmed,**
*Advocate*
H.No. 1-1-1279, Venkatadrinagar, Near Railway Over Bridge, Street No.6, Kazipet, Warangal - 506003

### నాయీ బ్రాహ్మణ సహకార సంఘం కార్యవర్గం



హన్మకొండ: నాయీ బ్రాహ్మణ పొదుపు పరపతి పరస్పర సహకార సంఘం నూతన కమిటీని హనుమకొండలోని సంఘం కార్యాలయంలో డాక్టర్ బండారు జగదీష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నాగవెల్లి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల రమేష్, ఉపాధ్యక్షుడిగా తూముల సాంబయ్య, కోశాధికారిగా శ్రీరాముల నరేందర్, సహాయ కార్యదర్శిగా కామోజీ జగన్, డైరెక్టర్లుగా నడిగోటి నవీన్, మొగిలిచర్ల సురేష్, జంపాల సుధాకర్, కురిమిళ్ల రమేష్, రాసమల్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను నూతన కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)